చకచకా రోడ్ల విస్తరణ

- రూ.5 కోట్లతో కణితి రోడ్
- రూ.11 కోట్లతో విస్తరిస్తున్న దువ్వాడ స్టేషన్ రోడ్
- శరవేగంతో సాగుతున్న పనులు



గాజువాక కణితి రోడ్‌లో విస్తరణ పనులు



అజీమాబాద్ గెడ్డపై నిర్మించిన వంతెన

గాజువాక : గాజువాకలో రెండు ప్రధాన రహదారుల విస్తరణ పనులు చకచకా సాగుతున్నాయి. సుమారు రూ.16 కోట్ల వ్యయంతో ఒకపక్క గాజువాకలోని కణితి రోడ్ విస్తరణ, మరోపక్క కూర్మన్నపాలెంలోని దువ్వాడ స్టేషన్ రోడ్ విస్తరణ పనులను జీవీఎంసీ అధికారులు చేపట్టారు. ఎప్పటి నుంచో పెండింగ్‌లో ఉన్న ఈ రోడ్ల విస్తరణపై దృష్టి సారించిన ప్రస్తుత ప్రభుత్వం త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించడంతో పనులను ప్రారంభించారు.

66 అడుగుల వెడల్పుతో కణితి రోడ్ విస్తరణ

గాజువాకలోని కణితి రోడ్‌ను ప్రస్తుతం వంటిల్లు జంక్షన్ నుంచి కొత్తగాజువాక మార్కెట్‌ను అనుకొని ఉన్న బీసీ రోడ్ వరకు విస్తరించనున్నారు. 66 అడుగుల వెడల్పుతో 1.25 కిలోమీటర్ల మేర విస్తరించేందుకు రూ.3 కోట్లను ఖర్చు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. మరో రూ.2 కోట్లతో రోడ్డుకిరువైపులా కాలువలను నిర్మించనున్నారు. రోడ్డు విస్తరణ నేపథ్యంలో రూ.90 లక్షలను ఖర్చు చేసి అజీమాబాద్ గెడ్డపై ఇటీవల వంతెనను కూడా నిర్మించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రోడ్డు విస్తరణ పనులు చకచకా సాగుతున్నాయి.

వందడుగుల వెడల్పుతో దువ్వాడ స్టేషన్ రోడ్

కూర్మన్నపాలెంలోని దువ్వాడ స్టేషన్ రోడ్ విస్తరణ పనులను రూ.11 కోట్లతో చేపట్టారు. ఈ రోడ్‌ను వందడుగుల వెడల్పుతో విస్తరించి 1.6 కిలోమీటర్ల వరకు అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదించారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వెలువడటంతో అధికారులు శరవేగంగా విస్తరణ పనులను సాగిస్తున్నారు. దీనికోసం ఇప్పటికే ఈ రోడ్‌లో సుమారు 60 నిర్మాణాలను తొలగించిన అధికారులు మరో పది నిర్మాణాలను తొలగించాలని నిర్ణయించారు. అందుకనుగుణంగా చర్యలను కూడా చేపట్టారు. ప్రస్తుతం రోడ్డుకిరువైపులా కాలువల నిర్మాణానికి సంబంధించిన పనులు సాగుతున్నాయి.



దువ్వాడ స్టేషన్ రోడ్ విస్తరణ పనులు

కమిషనర్ పరిశీలన : రోడ్ల విస్తరణ పనులను జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ ఇటీవల పరిశీలించారు. రెండు రోడ్లను పరిశీలించిన కమిషనర్ మొత్తం విస్తరణ పనులు మూడు వారాల్లో పూర్తి కావాలని జోనల్ అధికారులను ఆదేశించిన దరిమిలా అధికారులు అత్యంత ప్రాధాన్యతతో నిర్మాణ పనులను సాగిస్తున్నారు. సకాలంలో పనులను పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నట్టు గాజువాక జోనల్ అధికారులు తెలిపారు.

ఘనంగా దేవన్‌రెడ్డి జన్మదిన వేడుకలు



దేవన్‌రెడ్డికి కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి, చిత్రంలో కార్పొరేటర్ వంశీరెడ్డి తదితరులు





దేవన్ రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న దామా సుబ్బారావు, గంగా మహేష్

పెదగంట్యాడ/కూర్మన్నపాలెం/అక్కిరెడ్డిపాలెం: వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి, గాజువాక ఇన్‌చార్జి తిప్పల దేవన్‌రెడ్డి జన్మదిన వేడుకలను పార్టీ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, దేవన్‌రెడ్డి, కార్పొరేటర్ వంశీరెడ్డి కేక్ కట్ చేశారు. వేడుకల్లో నియోజకవర్గంలోని నాయకులు, కార్పొరేటర్లు, కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, వార్డు ఇన్‌చార్జిలు, కార్మిక సంఘాల నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

- దేవన్‌రెడ్డికి వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు దామా సుబ్బారావు పుష్పగుచ్ఛం అందించి, పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. 86వ వార్డు నాయకులు వెలుగుల పరశురాముడు, చేగొండి శ్రీనివాసరావు, శ్రీనివాస్‌పట్నాయక్, భూపతిరాజు శ్రీనివాసరాజు, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.
- 87వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు దేవన్‌రెడ్డిని గజమాలతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు. 87వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు, బొడ్డ గోవింద్, ప్రగడ వేణుబాబు, ముద్దపు దామోదర్, చిత్రాడ రమణ, ఆడారి శ్రీను, దుగ్గపు దానప్పలు, బొండా గోవిందరాజులు పాల్గొన్నారు.
- దేవన్ రెడ్డికి 88వ వార్డు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, ఎస్టీబీఎల్ ఎస్టేట్ మేనేజర్ గేదెల గంగా మహేష్ శుభాకాంక్షలు తెలిపారు.

నిరుపేదలకు నిత్యావసర సరకుల పంపిణీ

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు పెదమడకకు చెందిన సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రెండు నిరుపేద కుటుంబాలకు నెలకు సరిపడా నిత్యావసర సరుకులు అందించారు. పెదమడక బంగారమ్మ కాలనీ, దిబ్బపాలేనికి చెందిన రెండు కుటుంబాలకు బియ్యం, పప్పులు, ఆయిల్, ఇతర నిత్యావసర సరకులను ఉక్కు అధికారి ఎం.ఉమామహేశ్వరరావు ఆర్థిక సహాయంతో అందించారు. ట్రస్ట్ నుంచి పింఛను పొందుతున్న ఇద్దరు పింఛన్‌దారులు మరణించడంతో వారి అంత్యక్రియల కోసం ఒక్కొక్కరికీ రూ.రెండు వేలు వంతున నగదును అందించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ ఎం.మస్తాన్‌రెడ్డి, పట్టా రామ అప్పారావు, గుదే సుశీలా గజేంద్రరావు, లక్కరాజు రాము, శీరంశెట్టి గోవిందరావు, కిడిమి హనుమంతురావు పాల్గొన్నారు.



పేదలకు సరకులు అందిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

క్లుప్తంగా

సమష్టి సహకారంతో కోక్ ఓవెన్ అభివృద్ధి



నూతన విభాగాధిపతి దుర్గా ప్రసాద్‌కు బొకే అందజేస్తున్న విశ్రాంత ఈడీ ఎ.కె.సింగ్

ఉక్కునగరం: కోక్ ఓవెన్స్ అధికారులు, కార్మికులు సమష్టిగా కృషి చేస్తే మరింత అధిక ఉత్పత్తి సాధించవచ్చని స్టీల్‌ప్లాంట్ విశ్రాంత ఈడీ ఏ.కె.సింగ్ అన్నారు. నూతన విభాగాధిపతి ఎం.వి.ఎస్.దుర్గాప్రసాద్‌ను గురువారం ఆయన అభినందించారు. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ యాజమాన్యం అప్పగించిన బాధ్యతలను అధికారులు, ఉద్యోగుల సహకారంతో విజయవంతంగా పూర్తి చేసేందుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఇంటక్ చీఫ్ వైస్ ప్రసిడెంట్ కొమ్ము ప్రసాదరావు, టి.కనకరాజు, కె.ఆనందకుమార్, జి.రాజు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

పెదగంట్యాడ: నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్‌ఏసీ), రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఎన్‌ఏసీ అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్‌వీఎస్‌ఎస్ రవికుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎలక్ట్రీషియన్ కోర్సుల్లో ఖాళీలు ఉన్నాయని, రెండు నెలల పాటు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. వయసు 18 నుంచి 45 సంవత్సరాల మధ్య ఉండాలని, పదో తరగతి పాసైన వారు అర్హులని తెలియజేశారు. ఆసక్తి గల అభ్యర్థులు పెదగంట్యాడలోని ఎన్‌ఏసీ శిక్షణ సంస్థలో సంప్రదించాలని కోరారు. మరిన్ని వివరాలకు 83090 03957 ఫోన్ నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

నేడు విద్యుత్తు ఉండని ప్రాంతాలు

గాజువాక : గాజువాక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధి పంతులుగారి మేడ 11 కేవీ ఫీడర్‌కు ఈ నెల 27న మెయింటెనెన్స్ పనులు చేపట్టనున్నట్టు ఏపీఈపీడీసీఎల్ జోన్-2 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.కె.నాయుడు తెలిపారు. ఈ కారణంగా జోగవానిపాలెం, పంతులు గారి మేడ, నీల్ కమల్ ఎదురు వీధి ప్రాంతాలకు ఉదయం 8గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

షిప్‌యార్డ్‌లో ఎన్నికల సందడి

సింధియా : హిందూస్తాన్ షిప్‌యార్డ్‌లో గుర్తింపు యూనియన్ ఎన్నికల సందడి ప్రారంభమైంది.ఈ మేరకు శుక్రవారం ఓటరు జాబితాను ఎన్నికల రిటైనింగ్ అధికారి ప్రకటించనుండగా, శనివారం ఓటరు జాబితాపై అభ్యంతరాలను స్వీకరిస్తారు. నవంబర్ 7న తుది జాబితా ప్రకటించనున్నారు. 8వ తేదీన నామినేషన్లు స్వీకరిస్తారు. 9న నామినేషన్ల ఉపసంహారణతో పాటు ఎన్నికల గుర్తులను ప్రకటించనున్నారు. 18వ తేదీ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు గుర్తింపు యూనియన్ ఎన్నికలను నిర్వహించి, సాయంత్రం 5 గంటలకు విజేతలను ప్రకటిస్తారు.

ఆకట్టుకున్న భక్తిరంజని



భజనలు చేస్తున్న సాయిరాజ్

సీతమ్మధార : దొండపర్తిలోని ఎరుకుమాంబ అమ్మవారి ఆలయంలో గురువారం ధర్మ ప్రచార వారోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సాయిరాజు భక్తి రంజని ప్రతినిధుల భజనలు ఆకట్టుకున్నాయి. ఆధ్యాత్మికవేత్త ఎం.వి. రాజశేఖర్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో జి.వి.రమాబాయి, భక్తులు పాల్గొన్నారు.

ప్రాణాంతక వ్యాధితో చిన్నారి పోరాటం

- దాతలు సహకరించాలని తల్లిదండ్రుల విజ్ఞప్తి



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కుష్మిక

మద్దిపాలెం: ప్రాణాంతక వ్యాధికి గురై తమ ఆరేళ్ల కుమార్తె కుష్మిక మృత్యువుతో పోరాడుతోందని మురళీనగర్ తెన్నేటినగర్‌కు చెందిన పేద దంపతులు గణేష్, షారా ఆవేదన వ్యక్తం చేశారు. చిన్నారి వైద్యానికి సాయం చేసేందుకు దాతలు ముందుకు రావాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ మేరకు గురువారం తెన్నేటినగర్‌లోని జీసస్ వర్డ్ ఆఫ్ లైఫ్ పాస్టర్ అండ్ లీడర్స్ ఫెలోషిప్ కార్యాలయంలో మీడియాతో వారు మాట్లాడారు. తమ కుమార్తె ప్రస్తుతం ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతోందని చెప్పారు. వైద్యానికి సుమారు రూ.15 లక్షలు అవసరమవుతుందని డాక్టర్లు తెలియజేశారన్నారు. బంధువుల సహాయంతో ప్రాణాలు కాపాడుకొస్తున్న తమకు దాతలు సహాయం అందించి తమ బిడ్డ ప్రాణాలను కాపాడాలని వేడుకున్నారు. మీడియా ద్వారా దాతల సహాయం కోసం అభ్యర్థించారు. సహాయం చేసే వారు 79818 87454 నంబర్‌లో సంప్రదించాలని కుష్మిక తల్లిదండ్రులు కోరారు.

29న ఉత్తరాంధ్ర జిల్లాల యోగా పోటీలు



పోస్టర్ ఆవిష్కరిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: జిల్లా యోగా అసోసియేషన్, ఏయూ యోగా కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 29న ఉత్తరాంధ్ర జిల్లాల యోగా పోటీలు-2023 జరగనున్నాయి. ఈ మేరకు వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి గురువారం ఏయూ సైన్స్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఏయూ యోగా కేంద్రం సంచాలకుడు ఆచార్య ఒ.ఎస్.ఆర్.యు.భానుకుమార్, యోగా అసోసియేషన్ అధ్యక్షుడు కె.ఎ.రాజు పాల్గొన్నారు.

తల్లీ.. వెళ్లి రా..

- ముగిసిన శరన్నవరాత్రి ఉత్సవాలు
- నిమజ్జనానికి తరలిన దుర్గాదేవి విగ్రహాలు



నెల్లిముక్కులో నిమజ్జనానికి తీసుకువెళ్తున్న అమ్మవారి విగ్రహం



సీతానగరంలో అమ్మవారి ఊరేగింపు

పెదగంట్యాడ: దుర్గాదేవి శరన్నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా గురువారం పలు చోట్ల అమ్మవారి ఊరేగింపు కార్యక్రమాలు కొనసాగాయి. పెంటమాంబ యూత్ ఆధ్వర్యంలో నెల్లిముక్కులో, మొల్లి సన్యాసిరావు, మెరిండా బ్రదర్స్ ఆధ్వర్యంలో సీతానగరంలో అమ్మవారి విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ట్రాలీలపై అమ్మవార్లను ఉంచి పెదగంట్యాడ తదితర ప్రాంతాల్లో ఊరేగించారు. నృత్యాలు, శక్తి వేషాలు, డప్పులు, మహిళల కోలాటాలు, తీన్‌మార్‌తో ఊరేగింపు వైభవంగా జరిగింది. అనంతరం యారాడ, అప్పికొండ తీరాల్లో అమ్మవారి విగ్రహాలను నిమజ్జనం చేశారు.

ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యం

- ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి
- 76, 86 వార్డుల్లో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు



నెల్లిముక్కు పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది



అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

పెదగంట్యాడ: ప్రజారోగ్య పరిరక్షణే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యరంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామస్థాయిలో ఉన్నత వైద్యం అందించేందుకు ఊరూరా ఆరోగ్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. జీవీఎంసీ 76వ వార్డు పెదగంట్యాడ-2 సచివాలయ పరిధి నడుపూరు, రామచంద్రనగర్, రిక్షా కాలనీ, ఎస్సీ కాలనీకి సంబంధించి నెల్లిముక్కు పట్టణ ఆరోగ్య కేంద్రంలో గురువారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ గ్రామానికి ప్రభుత్వం కార్పొరేట్ స్థాయి వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చిందన్నారు, రాష్ట్ర ప్రజలంతా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలన్న మంచి ఆలోచనతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారన్నారు. ఈ శిబిరాల్లో ప్రజలకు వైద్య పరీక్షలు చేసి ఆరోగ్య సమస్యలున్న వారికి ఉచితంగా మందులు అందిస్తారని, శస్త్రచికిత్సలు అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ ఆస్పత్రులకు రిఫర్ చేస్తారని చెప్పారు. రూపాయి ఖర్చు లేకుండా ప్రభుత్వమే ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయిస్తోందని తెలిపారు. శిబిరంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనను పరిశీలించారు.

403మందికి వైద్యసేవలు

శిబిరంలో ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు డాక్టర్ రమేష్‌బాబు, హేమలత, ఎముకల డాక్టర్ నయ్యద్ అజ్మాల్, నేత్ర వైద్య నిపుణులు డాక్టర్ అంజనీ, దంత వైద్య నిపుణులు డాక్టర్ శ్రీనివాస్ చక్రవర్తి సేవలు అందించారు. శిబిరానికి వచ్చిన 403 మందికి వైద్య పరీక్షలతో పాటు అవసరమైన వారికి రక్తపరీక్షలు చేసి, మందులు అందించారు. ఏడుగురిని మెరుగైన చికిత్స కోసం కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. కార్యక్రమంలో జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక అధికారి డాక్టర్ ఉమావతి, జోన్-6 జోనల్ కమిషనర్ పి.సింహాచలం, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు దొడ్డి రమణ, తనకాల సత్యనారాయణ, ప్రమీల, సీహో సూర్యనారాయణ, అరుణ, కొల్లా శాంతి, సిబ్బంది పాల్గొన్నారు.



కంటి పరీక్ష చేస్తున్న డాక్టర్ అంజని

ఫకీర్‌తక్యాలోని శిబిరంలో 244 మందికి..

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 86వ వార్డు ఫకీర్‌తక్యా ఉర్దూ పాఠశాలలో యాదవ జగ్గరాజుపేట గ్రామ ప్రజలకు కణితి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్య సిబ్బంది గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా వైద్య సేవలను అందించారు. జోనల్ కమిషనర్ పొందూరు సింహాచలం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే నాగిరెడ్డి, పరిశీలించారు. శిబిరంలో సుమారు 244 మంది ప్రజలు వైద్య సేవలను పొందినట్లు వైద్యాధికారి శివయ్య తెలిపారు. కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ వాడపల్లి రామచంద్రరాజు, 88వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి గంధ్రెడ్డి మహలక్ష్మినాయుడు, సచివాలయ కన్వీనర్ నమ్మి శ్రీనివాసప్రసాద్, ఉరుకూటి అప్పారావు, మడిస రాజు తదితరులు పాల్గొన్నారు.



ఫకీర్‌తక్యా ఉర్దూ పాఠశాలలో ప్రజలకు రిజిస్ట్రేషన్ చేస్తున్న కణితి పీహెచ్‌సీ సిబ్బంది

పరిశ్రమలను కాపాడుకుంటేనే కార్మికులకు భవిష్యత్తు

కూర్మన్నపాలెం: ప్రభుత్వరంగ పరిశ్రమలను కాపాడుకుంటేనే కార్మికులకు భవిష్యత్తు ఉంటుందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. ఉక్కు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షలు గురువారానికి 987వ రోజుకు చేరుకున్నాయి. శిబిరంలో స్టీల్‌ప్లాంట్ ఎస్ఎంఎస్-1 విభాగ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నేడు కేంద్రప్రభుత్వ పెద్దలు దేశంలోని ప్రజా సమస్యలను వదిలిపెట్టి తమ రాజకీయ అవసరాల కోసమే పాలన సాగిస్తున్నారని విమర్శించారు. అధికార పార్టీల కుట్ర రాజకీయాలను వ్యతిరేకించాల్సిన ప్రతిపక్ష పార్టీలు వారికి వంతపాడుతున్నాయన్నారు. ప్రజాపోరాటాల ద్వారా జరిగే ఉద్యమాలకు పాలకులు కచ్చితంగా జవాబు ఇచ్చి తీరాలన్నారు. ఉక్కు పోరాటాన్ని ప్రజా ఉద్యమంగా మలచి పాలకులు స్పందించే విధంగా కార్మికులు పోరాడాలని పిలుపునిచ్చారు. శిబిరంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

అప్పన్నకు ఘనంగా ఆర్జిత సేవలు

సింహాచలం: శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు ఘనంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి స్వర్ణ పుష్పార్చన వైభవంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై అధిష్ఠింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపారు. అష్టోత్తర శతనామావళి పఠిస్తూ 108 స్వర్ణ సంపెంగ పుష్పాలతో స్వామికి అర్చన చేశారు. పూజలలో పాల్గొన్న ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

భక్తిశ్రద్ధలతో నిత్య కల్యాణం

శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్య కల్యాణం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేయింపజేసి ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణం జరిపించారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, సంకల్పం, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.



మాంగల్యధారణ ఘట్టాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

సిరులతల్లికి ఘనంగా సహస్ర తులసిపూజ

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మికి గురువారం సహస్ర తులసిపూజ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన పూజలో పలువురు ఉభయ దాతలు పాల్గొన్నారు. పంచామృతాభిషేక సేవ, శ్రీచక్ర నవావర్ణార్చన లక్ష్మీహోమంలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ధర్మకర్తలు, ఏఈవో తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, సిబ్బంది పాల్గొన్నారు.



సహస్ర తులసి పూజలో సిరులతల్లి

నేడు క్షీరాభిషేక సేవ

కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించనున్నారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 చెల్లించిన యెడల పూజకు దంపతులను లేదా ఇద్దర్ని అనుమతిస్తారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891-2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు.

'ఓపెన్ హౌస్'పై విద్యార్థులకు అవగాహన

సీతమ్మధార: పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించారు. దీనికి అక్కయ్యపాలెం జ్ఞాననికేతన్ స్కూల్ విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఐ ఎస్.విజయకుమార్ మాట్లాడుతూ స్టూడెంట్లకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. మ్యాన్‌ప్యాక్‌లు ఉపయోగించే తీరు, అత్యవసర సమయంలో పోలీసులు స్పందించే తీరు, కేసుల నమోదు, రిసెప్షన్ తీసుకున్న నిర్ణయాలు, స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మాట్లాడే విధానం, ఆయుధాలు ఎప్పుడు ఉపయోగించాలనే విషయాలను తెలియజేశారు. స్టేషన్‌లో విధులు నిర్వర్తించే సీఐ, ఎస్ఐ, ఏఎస్ఐ, హెచ్‌సీ, పీసీల విధివిధానాలపై వివరించారు. ప్రతి ఒక్క విషయాన్ని విద్యార్థులు ఆసక్తిగా ఆలకించారు. వారితో సీఐ విజయకుమార్ కాసేపు ముచ్చటించారు. 57 మంది కళాశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఎస్ఐలు వెంకటరావు, ప్రమీల పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీఐ విజయకుమార్